సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 18 । నవంబర్ । 2024



..ఆరోగ్యానికి కుదుపు

జిల్లాలోని పలువురు వ్యాపారులు కృత్రిమంగా ఫలాలను పక్వానికి తీసుకొస్తుండడంతో వినియోగదారుల ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. 8లో



ఎట్టకేలకు విడుదల !

ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాల కమిటీల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. 10లో

గరిష్టం / కనిష్టం
30° / 17°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ ప్రభావం అధికంగా ఉంటుంది. రాత్రి వాతావరణం చల్లబడుతుంది.

సుజాతనగర్ కేంద్రంలో కలెక్టర్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు



సెయింట్ జోసఫ్ పాఠశాలలో నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్పీ



పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బారులుదీరిన అభ్యర్థులు







సింగరేణి మహిళా కళాశాల ఎదుట వేచి చూస్తున్న అభ్యర్థులు



కొత్తగూడెంలోని ఓ పరీక్ష కేంద్రానికి చిన్నారులతో వచ్చిన అభ్యర్థి

ప్రశాంతంగా గ్రూప్–3

- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ
- ఆలస్యంగా వచ్చిన పలువురు పరీక్షకు దూరం
- భారీ బందోబస్తు నడుమ రెండు సెషన్లలో నిర్వహణ

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్ –3 పరీక్ష జిల్లాలో తొలిరోజు ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తును నిర్వహించారు. పరీక్ష సమయానికి అర్ధగంట ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకోవాలని అధికారులు ముందు నుంచే సూచిస్తున్నా కొందరు పెడచెవిన పెట్టి ఆలస్యంగా రావడంతో 20 మందికి పైగా అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించలేదు. సాయంత్రం పరీక్ష 5 గంటల వరకే ముగిసినా సెంటర్లలో ప్రక్రియ అంతా పూర్తయ్యాక 5.30 గంటల తర్వాత అభ్యర్థులను బయటకు పంపించారు. షూ, సెల్‌ఫోన్లతో పాటు కొన్ని కేంద్రాల్లో మహిళల చెవిదిద్దులను కూడా లోనికి అనుమతించలేదు. ప్రతి సెంటర్‌లో దివ్యాంగుల కోసం వీల్ చైర్లు ఏర్పాటు చేశారు.

కలెక్టర్, ఎస్పీ తనిఖీ..

కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పరీక్షను కలెక్టర్ జితేష్ వి.పాటిల్, రుద్రంపూర్‌లోని సెయింట్‌జోసెఫ్ పాఠశాల కేంద్రాన్ని ఎస్పీ రోహిత్‌రాజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇక కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల, సుజాతనగర్‌లోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను పరిశీలించేందుకు వెళ్లిన కలెక్టర్ పాటిల్‌ను కూడా నిబంధనల ప్రకారం పోలీసులు తనిఖీ చేశారు.

అభ్యర్థుల హాజరు ఇలా..

జిల్లాలో గ్రూప్ – 3 పరీక్ష కోసం కొత్తగూడెంలో 26, పాల్వంచలో 13 కేంద్రాల ఏర్పాటు చేశారు. ఉదయం పరీక్షకు 13,478 మంది అభ్యర్థులకు గాను 7,212 మంది హాజరు కాగా, 6,266 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 13,478 మందికి 7,238 మంది హాజరు కాగా, 6,244 మంది గైర్హాజరయ్యారు. 300 మంది పోలీసులు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు.

పాల్వంచలో కలెక్టర్ తనిఖీ

పాల్వంచ: పట్టణంలోని డీఏవీ పాఠశాల కేంద్రంలో నిర్వహించిన గ్రూప్– 3 పరీక్షను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తనిఖీ చేశారు. పరీక్షల అధికారితో మాట్లాడి అభ్యర్థుల హాజరు శాతం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. సోమవారం నాటి పరీక్ష కూడా ప్రశాంతంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్


రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి ఆదివారం విశేష పూజలు చేశారు. జిల్లా నలుమూలలతో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు తమ చిన్నారులకు అన్నప్రాశనలు జరిపించారు. ఒడిబియ్యం, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమాల్లో ఈఓ ఎన్.రజనీకుమారి, వేదపండితులు పద్మనాభ శర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్‌కు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే గిరిజన దర్బార్‌లో ఆదివాసీ గిరిజనులు తమ సమస్యలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు అందజేయాలని పేర్కొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే, గ్రూప్ – 3 పరీక్షల నేపథ్యంలో అధికారులు అందుబాటులో ఉండరని, సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తులు అందజేయడానికి కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

బీసీ కమిషన్‌కు వినతుల వెల్లువ



కమిషన్ చైర్మన్ ఎదుట వాదనలు వినిపిస్తున్న బీసీ సంఘాల నాయకులు

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

- విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కులవృత్తుల వారిని ఆ కులం కిందే గుర్తించాలి
- బీసీల నుంచి దరఖాస్తులు స్వీకరించిన డెడికేటెడ్ కమిషన్
- ప్రభుత్వానికి అందజేస్తామన్న చైర్మన్ బూసాని

ఖమ్మంమయూరిసెంటర్: స్థానిక సంస్థలతో పాటు అన్ని రకాల ఎన్నికలు, ప్రభుత్వం కల్పించే ఇతర అంశాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని పలు పార్టీలకు చెందిన బీసీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు తెలంగాణ బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు వినతులు అందజేశారు. కమిషన్ ఎదుట తమ వాదనలు వినిపించారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల గుర్తింపు అంశంపై బీసీ డెడికేటెడ్ కమిషన్ చేపట్టిన బహిరంగ విచారణకు ఉమ్మడి జిల్లా నుంచి బీసీలు భారీగా హాజరయ్యారు. డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వేంకటేశ్వరరావు, సెక్రటరీ బి.సైదులు, ఖమ్మం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి వారి నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ దామాషా అమలు చేయాలంటూ వడ్డెర సంఘం, సంచార జాతుల ప్రతినిధులు, విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ, ముస్లిం, మైనారిటీ, మత్స్యకారులు, పూసల, చాకలి, దూదేకుల, యాదవ, గొల్ల కురుమ, సంచార ముస్లిం జాతి, కుమ్మరి, ఎంబీసీ తదితర సంఘాల ప్రతినిధులు వినతులు అందజేశారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ ఎందుకు పెంచాలనే అంశంపై కమిషన్ ఎదుట పలువురు తమ వాదనలు వినిపించగా.. కమిషన్ ప్రతినిధులు నమోదు చేసుకున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ అమలుకు వివిధ సంఘాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను క్రోడీకరిస్తూ నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు తెలిపారు. కార్పొరేటివ్ సొసైటీ యాక్ట్ కింద నిర్వహించే ఎన్నికలు రాష్ట్ర ఎన్నికల సంఘం పరిధిలోకి రావని, ఆ అంశం తన పరిధిలో లేదని దీనిపై వాదనలు వినిపించిన వారికి వివరించారు. ఇప్పటి వరకు పలు జిల్లాల్లో డెడికేటెడ్ కమిషన్ బహిరంగ విచారణ సభలు నిర్వహించిందని, ఇందులో అత్యధికంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే బీసీలు పాల్గొని వినతులు అందజేశారని తెలిపారు. చైతన్యవంతమైన వాదనలు వినిపించారని అన్నారు. తొలుత కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, రిజిస్ట్రేషన్ కేంద్రాన్ని కమిషన్ చైర్మన్ పరిశీలించారు.

బూసానికి సన్మానం..

ఖమ్మం పర్యటనకు వచ్చిన బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావును ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ సత్కరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌పై వినతులు అందజేసిన ఆయన చైర్మన్‌కు తన వాదనలను వినిపించారు. అలాగే మైనారిటీ ముస్లిం దూదేకుల వృత్తి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సిద్దా సాహెబ్, జాతీయ ఇన్‌చార్జ్ షేక్ షకినా తమ వాదనలను వినిపించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు వి.రమేష్, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల బీసీ సంక్షేమ అధికారిణులు గుడికందుల జ్యోతి, ఇ.ఇందిర, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

‘కులాంతర’ కానుకేది?

- జిల్లాలో రూ.3.90 కోట్ల మేర పెండింగ్
- ఇబ్బంది పడుతున్న ప్రేమ పెళ్లి దంపతులు

కొత్తగూడెంరూరల్: కులాంతర వివాహాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇచ్చే కానుక జిల్లాలో అందని ద్రాక్షగానే మారింది. ప్రేమ పెళ్లి చేసుకున్న దంపతులకు ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకం అందడం లేదు. కులాంతర వివాహం చేసుకున్న జంటకు ప్రభుత్వం రూ.2.50 లక్షల కానుక ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వివాహం చేసుకున్న వారి పేరుతో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారులు బాండ్ అందజేస్తారు. దీన్ని మూడేళ్ల వరకు బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే, ఆ తర్వాత అసలు, వడ్డీ కలిపి దంపతులు తీసుకునే అవకాశం ఉంటుంది. అయితే ఈ దంపతుల్లో ఒకరు దళితులై ఉండాలనే నిబంధన విధించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం కొంతమందికి మాత్రమే ఈ నిధులు విడుదల చేస్తుండగా మిగిలిన వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. ఇలా ప్రతీ ఏడాది బకాయిల జాబితా పెరుగుతోంది. కానుక కోసం దంపతులు జిల్లా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు.

మూడేళ్లుగా ఇదే తంతు..

2020 – 21 ఆర్థిక సంవత్సరంలో ప్రేమ పెళ్లి చేసుకున్న దంపతులు జిల్లాలో 45 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో నాలుగు దరఖాస్తులు తిరస్కరణకు గురి కాగా 41 మందిని అర్హులుగా ప్రకటించారు. అయితే ఇందులో ఐదుగురికి మాత్రమే రూ.12.50 లక్షల విలువైన బాండ్‌లు అందజేశారు. మిగతా 36 మందికి రూ.90 లక్షలు విడుదల కావాల్సి ఉంది. 2021 – 22 లో 83 మంది దరఖాస్తు చేసుకోగా, నాలుగు తిరస్కరించారు. 79 మందిని అర్హులుగా గుర్తించగా 25 మందికి రూ.62.50 లక్షలు వచ్చాయి. ఇంకా 54 మందికి రూ. 1.35 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. 2022 – 23లో 64 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరందరినీ అర్హులుగానే గుర్తించినా 20 మందికి మాత్రమే రూ.50 లక్షల విలువైన బాండ్‌లు పంపిణీ చేశారు. మిగితా 44 మందికి రూ. 1.10 కోట్ల బడ్జెట్ ఇప్పటికీ రాలేదు. 2023 – 24లో 35 మంది దరఖాస్తు చేసుకోగా, వీరందరూ అర్హత సాధించారు. కానీ 13 మందికి మాత్రమే కానుకలు అందగా, మిగిలిన 22 మంది ఎదురుచూస్తున్నారు. ఇలా జిల్లాలో ఇప్పటివరకు 227 మంది దరఖాస్తు చేసుకోగా, 8 మంది దరఖాస్తులను తిరస్కరించారు. మిగతా 219 మందిలో 63 మందికి మాత్రమే రూ.1.57 కోట్లు వచ్చాయి. మిగిలిన 156 మందికి రూ.3.90 కోట్లు రావాల్సి ఉంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి తమకు త్వరగా నిధులు మంజూరు చేయాలని కులాంతర వివాహ జంటలు కోరుతున్నాయి.

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

కులాంతర వివాహం చేసుకున్న వారు ఈ పాస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కుల, ఆదాయ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, దంపతుల జాయింట్ బ్యాంకు అకౌంట్, పెళ్లి ఫొటోలు, వయసు ధ్రువీకరణ పత్రాలు, స్థానికంగా నివాసం ఉంటున్నట్టుగా ధ్రువీకరణతో పాటు ఇద్దరి ఆధార్ కార్డులు, ఇద్దరు సాక్షుల సంతకాలు ఉండాలి. ఇద్దరిలో ఒకరికి ఎస్సీ సర్టిఫికెట్ ఉండాలి.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



కిన్నెరసాని బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా తరలివచ్చి డ్యామ్‌పై నుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 470 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.16, 450, 450 మంది బోటు షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్‌కు రూ.15,780 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నాలుగు నెలల తర్వాత తెరుచుకున్న గేట్..

ఓ మహిళ డ్యామ్‌పై నుంచి రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో కేటీపీఎస్ అధికారులు ఈ ఏడాది జూలై 2వ తేదీన డ్యామ్ గేట్‌ను మూసివేశారు. దీంతో కిన్నెరసానికి వచ్చే పర్యాటకులు డ్యామ్‌పైకి వెళ్లి జలాశయాన్ని వీక్షించే అవకాశం లేకుండా పోయింది. శనివారం కిన్నెరసానికి కలెక్టర్ జితేష్ వి పాటిల్ రాగా, ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో కేటీపీఎస్ సీఈ ప్రభాకర్‌తో ఫోన్‌లో మాట్లాడి గేట్ ఓపెన్ చేయాలని ఆదేశించారు. దీంతో ఆదివారం డ్యామ్ గేటుకు వేసిన తాళాన్ని తీయడంతో పర్యాటకులు డ్యామ్ పైకి వెళ్లి జలాశయాన్ని తిలకించి పరవశించారు.

చెత్తశుద్ధికి చర్యలు..



ఇల్లెందులో ఏర్పాటుచేసిన బయో మైనింగ్ కేంద్రం

- డంపింగ్ యార్డులో బయోమైనింగ్ కేంద్రం
- జిల్లాలో తొలిసారి ఇల్లెందులో ఏర్పాటు
- నాలుగు రోజుల క్రితమే ప్రారంభం
- త్వరలో కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరులోనూ..



బయో మైనింగ్‌లో తయారైన ఎరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, చైర్మన్ డీవీ

ఇల్లెందు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ‘స్వచ్ఛ పట్టణాలు’ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ డంపింగ్ యార్డులో ఏళ్లుగా పేరుకుపోయిన చెత్తను బయోమైనింగ్ ద్వారా శుద్ధి చేస్తున్నారు. జిల్లాలో మొదట ఇల్లెందులో ఈ విధానం అమల్లోకి తెచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు నాలుగు రోజుల క్రితమే ప్రారంభించారు. పట్టణంలో 180 కిలోమీటర్ల మేర కాలువలు, 70 మురికివాడలు ఉండగా, ప్రతీ రోజు 50 మెట్రిక్ టన్నుల చెత్త డంపింగ్ యార్డులకు చేరుతుంది. బయోమైనింగ్ ద్వారా చెత్త నుంచి మళ్లీ ఉపయోగించేందుకు అవసరమైన వస్తువులను వెలికితీయనున్నారు. మట్టి, రాళ్లు, గాజు, ప్లాస్టిక్, మెటల్, మండే పదార్థాలను వేరు చేస్తున్నారు. భూమిలో కరిగిపోని వస్తువులను వేరు చేసి, కరిగిపోయే వాటితో ఎరువు తయారు చేస్తారు. దీంతో వాతావరణం కలుషితం అయ్యే అవకాశం ఉండదు. త్వరలో కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు మున్సిపాలిటీల్లోనూ ఈ విధానం అమల్లోకి రానుంది.

ముందుకొచ్చిన ‘క్యూబ్’..

ఇల్లెందులో ఏళ్లుగా పేరుకుపోయిన చెత్తను మూడు నెలల్లో రీ సైక్లింగ్ చేసేందుకు క్యూబ్ బయో ఎనర్జీ అనే సంస్థ ముందుకొచ్చింది. ఇల్లెందు బైపాస్ రోడ్‌లోని డీఆర్‌సీపీ భవన్‌లో గల డంపింగ్ యార్డులో ఈ బయోమైనింగ్ యంత్రాన్ని అమర్చారు. రోజుకు రెండు షిఫ్టులు పని చేస్తారు. ఒక్కో షిఫ్ట్‌లో కనీసం పది మంది పని చేయాల్సి ఉంటుంది. ఇలా మూడు నెలల్లో పట్టణంలో పేరుకుపోయిన చెత్తను శుద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందుకు గాను కంపెనీకి ఎంత చెల్లించాలనే దానిపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. ఇంతకాలం పేరుకుపోయిన చెత్తను మూడు నెలల్లో శుద్ధి చేయనుండగా, ఆ తర్వాత మళ్లీ మున్సిపల్ అధికారులు పిలిచినప్పుడు వచ్చేలా ఒప్పందం చేసుకున్నారు.

యంత్రం పని చేసే విధానం ఇలా..

బయోమైనింగ్ యంత్రంలో మూడు ప్రధాన విభాగాలు ఉన్నాయి. 13 మోటార్లు నిరంతరం రన్ అవుతుంటాయి. ఇందుకు 43 కేవీ లోడ్ విద్యుత్ అవసరం. లెగసీ వేస్ట్ వద్ద చెత్త వేస్తే ఎంబీఎఫ్ బెల్ట్ సహాయంతో ట్రోనల్‌లోకి కన్వేయర్ బెల్ట్ ద్వారా చెత్త చేరుతుంది. ఇక్కడి నుంచి చెత్త వేరు చేయడం మొదలవుతుంది. ఆర్‌డీఎఫ్ అనే మిషన్‌లో మట్టి, రాళ్లు, గాజు, పేపర్లు, మెటల్, నిర్మాణ సామగ్రిని వేరు చేస్తుంది. భూమిలో కరిగిపోయే వాటితో ఎరువు తయారు చేసుకునే అవకాశం ఉంటుంది. కరిగిపోని వస్తువులను రీ సైక్లింగ్ కోసం తరలించవచ్చు.

పట్టణాల్లో చెత్త ఉత్పత్తి వివరాలు ఇలా..

మున్సిపాలిటీ	వార్డులు	వెలువడుతున్న చెత్త (రోజుకు మె.ట.)	మురికివాడలు
ఇల్లెందు	24	50	70
కొత్తగూడెం	36	175	80
పాల్వంచ	24	150	110
మణుగూరు	22	50	55

వాతావరణ కాలుష్యం ఉండదు



చెత్తను బయోమైనింగ్ చేయడం ద్వారా వాతావరణంలో కాలుష్యం లేకుండా చేయొచ్చు. ఇల్లెందులో మూడు నెలల్లో మొత్తం చెత్తను రీసైక్లింగ్ చేసి శుద్ధి చేస్తాం. చెత్త నుంచి తయారయ్యే ఎరువులను పంటలకు, పార్కులకు ఉపయోగించుకోవచ్చు. భూమిలో కరిగిపోని వస్తువులను మళ్లీ వాడుకలోకి తీసుకురావచ్చు. – విజయ్, క్యూబ్ బయో ఎనర్జీ ఇన్‌చార్జ్

అనేక లాభాలు ఉన్నాయి



పట్టణంలో ప్రతీ రోజు సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి రీ సైక్లింగ్ చేయడం ద్వారా అనేక ఉపయోగాలు ఉన్నాయి. ముఖ్యంగా వాతావరణ కాలుష్యం బారి నుంచి కాపాడుకోవచ్చు. చెత్తను వేరు చేసి ఎరువు తయారుచేసే పద్ధతి ఇల్లెందులో ఏర్పాటు కావడం హర్షణీయం.

– సీహెచ్ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్

19న ప్రజాభిప్రాయ సేకరణ

ఖమ్మంమయూరిసెంటర్: ఈ నెల 19న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఐడీఓసీ సమావేశ మందిరంలో బీసీ కమిషన్ పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కస్తాల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మైనారిటీ మత గురువులు, మేధావులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, ఎన్‌జీఓలు, ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలపాలని కోరారు. తమ విలువైన సలహాలు, సూచనలు, వినతులను ఆరు సెట్లు ధ్రువీకరణ అఫిడవిట్ రూపంలో సమర్పించాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

భద్రాద్రి కవికి అరుదైన అవకాశం

అంతర్జాతీయ వర్చువల్ బుక్ ఫెయిర్‌కు ఆహ్వానం


దుర్గాచారి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన ప్రముఖ కవి తాతోలు దుర్గాచారికి అరుదైన అవకాశం దక్కింది. పెరూ దేశంలో జరిగే అంతర్జాతీయ వర్చువల్ బుక్ ఫెయిర్–2024లో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. బుక్ ఫెయిర్ సంస్థ అధినేత సీజార్, భారతదేశ సాంస్కృతిక రాయబారి, ప్రముఖ కవి ప్రభావతి జోశ్యుల తనను ఆహ్వానించారని దుర్గాచారి తెలిపారు. భద్రాచలం ఆర్టీసీ డిపోలో కంట్రోలర్‌గా విధులు నిర్వర్తిస్తున్న దుర్గాచారికి అరుదైన అవకాశం దక్కడంతో డిపో మేనేజర్ తిరుపతితో పాటు పలువురు కవులు, కళాకారులు అభినందనలు తెలిపారు.

ఇసుక రాశులు సీజ్

ములకలపల్లి: అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక రాశులను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గిర్వావర్–2 భద్రు కథనం మేరకు.. మండలంలోని ముత్యాలంపాడు శివారులో భారీగా ఇసుక డంప్ చేసినట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. వంతెన నిర్మిస్తున్న ప్రదేశంలో ఎలాంటి అనుమతి లేకుంగా నిల్వ ఉంచిన 30 ట్రాక్టర్ల ఇసుకను అధికారులు సీజ్ చేశారు. ముగ్గుపోసి ఇసుక రాశులను స్వాధీనం చేసుకున్నారు.

కేసు నమోదు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ వైద్యకళాశాలలో ఓ విద్యార్థికి గుండు కొట్టించిన ఘటనపై ఆదివారం కేసు నమోదు చేశామని వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ములుగుకు చెందిన కొర్రా వివేక్‌రాజు నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడు. ఈ నెల 12వ తేదీన ఆధునికంగా ఉండేలా జుట్టు కత్తిరించుకోగా.. కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసే రెహమాన్ జెడ్పీసెంటర్‌లోని ఓ హెయిర్ స్టైల్‌కు తీసుకెళ్లి గుండు కొట్టించినట్లు తెలిపారు. బాధిత విద్యార్థి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న విద్యార్థిని మృతి

పాల్వంచ: కడుపునొప్పి తాళలేక పురుగులమందు తాగిన విద్యార్థిని చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని గొల్లగూడెంనకు చెందిన బానోత్ కిషన్ కూతురు వెన్నెల (16) పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. గత 15వ తేదీన ఇంట్లో పురుగులమందు తాగింది. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. తల్లి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోద్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి మందు తాగిన వ్యక్తి...

ఇల్లెందు: ఇల్లెందు మండలం బీడీకాలనీ చెందిన అఫ్జల్ (27) గత నెల 25న గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించగా చికిత్స పొంది.. ఇంటికి వచ్చిన అనంతరం పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న అఫ్జల్‌పై భార్య కేసు పెట్టిందని మనస్తాపానికి గురై గడ్డి మందు తాగగా ఇల్లెందు, ఖమ్మం, వరంగల్ వైద్యశాలలకు తరలించారు. కోలుకున్న అఫ్జల్‌ను వైద్యుల సూచన మేరకు ఇంటికి తీసుకొచ్చారు. రెండో రోజే ఆరోగ్యం విషమంగా మారింది. మళ్లీ వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. తల్లి పర్వీన్ ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ సందీప్ కేసు నమోదు చేశారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ఇల్లెందు: వివాహమై నాలుగేళ్ల తర్వాత భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు స్టేషన్‌బస్తీకి చెందిన రామనబోయిన మానస ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్త రవి, అత్త, మామలు యశోద, లింగయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

విషపు మెరుపు.. ఆరోగ్యానికి కుదుపు..


విక్రయానికి సిద్ధంగా ఉన్న పలు రకాల పండ్లు

కెమి'కిల్' ఫ్రూట్స్..

- అసహజ పద్ధతుల్లో మగ్గుతున్న పండ్లు
- ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న వ్యాపారులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

ఇల్లెందురూరల్: జిల్లాలో ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాలల్లో పండ్ల వ్యాపారం చేసే పెద్ద వ్యాపారులు, చిరు వ్యాపారులు వేల సంఖ్యలో ఉన్నారు. ఆయా పండ్ల దుకాణాల ద్వారా రోజుకు రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతోంది. నాణ్యతతో కూడిన పండ్లను ఆయా దుకాణాల్లో విక్రయించేలా చూడాల్సిన బాధ్యత ఫుడ్ సేఫ్టీ అధికారిపై ఉంటుంది. కానీ, పండ్లను కృత్రిమ పద్ధతుల ద్వారా పక్వానికి తీసుకొచ్చి యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు తీసుకున్న చర్యలు నామమాత్రమే అని చెప్పాలి.

కార్తీక మాసంలో అధికంగా వినియోగం

కార్తీక మాసం.. ఈ కాలంలో దాదాపు అన్ని రకాల పండ్లు అందుబాటులో ఉంటాయి. ప్రజలు వాటిని ఎక్కువగా వినియోగించేది కూడా ఈ కాలంలోనే. పూజలు, వ్రతాలు, నోములు అధికంగా చేసుకునే మాసం కార్తీకం. పైగా అత్యధికులు ఉపవాస దీక్షలు కూడా పాటిస్తుంటారు. ఇంతేకాకుండా పలువురు అయ్యప్ప మాలను ధరించి భగవంతుని ధ్యానంలో ఉంటారు. ఈ సమయంలో భక్తులు ఆహారంగా పండ్లను అత్యధికంగా తీసుకుంటారు. అందుకే ఈ కాలంలో పండ్లకు మంచి గిరాకీ ఉంటుంది.

పూర్వం ఇలా మాగబెట్టేవారు

కాయలను పండ్లుగా మార్చేందుకు అనేక విధానాలు ఉన్నా వాటిని వ్యాపారులు వినియోగించడం లేదు. గతంలో కాయలు పక్వానికి వచ్చిన సమయంలోనే కోసి మాగబెట్టేవారు. సాంబ్రాణి పొగ, పీచు పొగతో కాయలను పండ్లుగా మార్చేవారు. అంతేకుండా ఇథలీన్ గ్యాస్ ఛాంబర్స్ ద్వారా కాయలను పండ్లుగా మార్చవచ్చని.. అలా మాగేసిన పండ్లు ప్రమాదకరం కాదని ఆహారకల్తీ నిరోధకశాఖ కూడా చెబుతోంది. చిరు వ్యాపారులు లేదా ఇళ్లలో అయితే పచ్చి ఆకులు, లేదా ఎండుగడ్డిని బుట్టలో పెట్టి అందులో పచ్చికాయలను పేర్చి మాగబెట్టేవారు. ఇలా మాగిన పండ్లు ఎంతో రుచికరంగా ఉంటాయని పలువురు చెబుతున్నారు. కానీ నేడు ఆయా పద్ధతులను ఎవరూ ఆచరించడం లేదు.

ప్రస్తుతం ఏం చేస్తున్నారంటే..

ప్రస్తుతం మార్కెట్‌లో పండ్లను చూస్తే నోరూరుతుంది. తింటే మాత్రం ఆరోగ్యం పణంగా పెట్టినట్లే. జిల్లాలో పండ్ల పరిస్థితి ఇలానే ఉంది. లాభార్జనే ధ్యేయంగా వ్యాపారులు కృత్రిమ పద్ధతుల్లో పండ్లను విషపూరిత రసాయనాలతో మాగబెడుతున్నారు. పక్వానికి వచ్చిన బత్తాయి కాయలను ఆరుబయట ఉంచితే ఐదు, ఆరు రోజుల్లో పండుతాయి. చిన్న కాయలను తీసి మార్కెట్లకు తెచ్చి రంగు తెచ్చేందుకు కాల్షియం కార్బైడ్‌ను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం అరటి పండ్లకు డిమాండ్ పెరగడంతో పచ్చి కాయలను తెచ్చి ఇంజక్షన్ రూపంలో రసాయనాలు ఇచ్చి పసుపు వర్ణం వచ్చేలా చేస్తున్నారు. ప్రస్తుతం యాపిల్ కాయలన్నీ పూర్తి వ్యాక్స్ (మైనం)తోనే నిండి ఉంటాయి. ఎక్కువకాలం నిల్వ ఉంచేందుకు ఆపిల్‌పై మైనపు పూత పూస్తారని వ్యాపారులే చెబుతున్నారు. వేసవిలో అందుబాటులోకి వచ్చే మామిడి కాయలను కూడా కార్బైడ్‌ను ఉపయోగించి వేగవంతంగా మాగబెడుతున్నారు. ఇలా దానిమ్మ, సీతాఫలం వంటి పండ్లను పెట్టెల్లో ఉంచి రసాయన పదార్థాల పొట్లాలు ఉంచడం ద్వారా వాటి సహజ గుణానికి భిన్నంగా మాగబెడుతున్నారు. ఇలా ఒకటి కాదు.. అనేకరకాల పండ్లపై పలు రకాలుగా విష ప్రయోగం చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో వ్యాపారులు చెలగాటమాడుతున్నారు.

ఎవరికీ పట్టని ప్రజారోగ్యం

ప్రతివ్యక్తి రోజుకు సగటున 160 గ్రాముల పండ్లు తింటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. అందరికీ ఈ స్థాయిలో తినడం సాధ్యం కాదు. పోనీ తిన్నవారి ఆరోగ్యం మెరుగవుతుందా.. అంటే అనారోగ్యమేనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. దాదాపు అన్ని రకాల పండ్లను కృత్రిమ పద్ధతిలో మాగబెట్టడమే దీనికి ప్రధాన కారణం వాస్తవానికి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత సంబంధిత శాఖలదే. నిరంతరం తనిఖీలు నిర్వహించి నమూనాలు సేకరించి విషపూరిత రసాయనాలు వినియోగిస్తున్నట్లు తెలితే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవచ్చు. కానీ, జిల్లాలో పండ్లను పక్వానికి తెచ్చేందుకు యథేచ్ఛగా రసాయనాలు వినియోగిస్తున్నా ఎవరికీ పట్టడంలేదు.


మార్కెట్‌లోని యాపిల్

జాగ్రత్తలు తీసుకోవాలి



రసాయనాలతో పండించిన పండ్లు ఆరోగ్యానికి చేటు తెస్తాయి. ప్రధానంగా కార్బైడ్ వినియోగించిన పండ్ల వల్ల ప్రజలు గ్యాస్ సంబంధిత వ్యాధులకు గురవుతుంటారు. ఇతర రసాయనాలు కూడా ఆరోగ్యాన్ని హరిస్తాయి. పండ్లు కొనే సమయంలో జాగ్రత్తలు అవసరం. సహజసిద్ధంగా, స్థానికంగా లభించే పండ్లను ఆహారంగా తీసుకోవాలి.

–డాక్టర్ కవిత, వైద్యాధికారిణి, రొంపేడు పీహెచ్‌సీ

విద్యార్థులకు క్షేత్రస్థాయి పర్యటనలు


సింగరేణి వర్క్‌షాపులో ఆన్ జాబ్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

రెండు నెలల పాటు ఉద్యోగ శిక్షణ

- ఉత్సాహంగా పాల్గొంటున్న ఒకేషనల్ విద్యార్థులు
- మోటార్ వైండింగ్‌తో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్లలో..

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి, ఆన్‌జాబ్ ట్రైనింగ్‌ను అధ్యాపకులు అందిస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్‌కు సంబంధించిన 32 కళాశాలల ఒకేషనల్ విద్యార్థులు ఉత్సహంగా పాల్గొంటున్నారు. శిక్షణ రెండు నెలల పాటు జరుగనుంది. తరగతి గదుల్లో నేర్చుకున్న పాఠాలతో పాటు క్షేత్రస్థాయిలో నేర్చుకున్న విద్య ఎప్పటికీ గుర్తు ఉండి, భవిష్యత్‌లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధ్యాపకులు చెబుతున్నారు. డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదివే ఒకేషనల్ విద్యార్థులకు క్షేత్రస్థాయి పర్యటనలు చేయిస్తున్నారు. అందులో భాగంగా విద్యార్థులకు విద్యుత్ సబ్‌స్టేషన్లలో శిక్షణ, విద్యుత్ మోటార్ వైండింగ్ సెంటర్లలో శిక్షణ ఇప్పిస్తున్నారు. శిక్షణకు విద్యార్థులతో పాటు అధ్యాపకులు గైర్హాజరు కాకుండా ఆదేశాలు జారీ చేశారు. వర్క్‌షాపుల్లో వైండింగ్ చేసే విధానంతో పాటు స్టార్టర్ డబ్బాల మరమ్మతులు, పలు మిషన్ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో నేర్చుకునే శిక్షణ, అవగాహనతో భవిష్యత్‌లో విద్యార్థులు ఉపాధి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అధ్యాపకులు చెబుతున్నారు. దీంతో పాటు ఆఫీస్ అసిస్టెంట్‌షిప్, అకౌంటెంట్ టాక్సేషన్ ఒకేషనల్ కోర్సు చదువుతున్న విద్యార్థులు సైతం పలు బ్యాంకుల్లో శిక్షణ పొందుతున్నారు. బ్యాంకుల మేనేజర్లు విద్యార్థులకు పూర్తిస్థాయిలో బ్యాంకు సేవల వివరాలను తెలుపుతున్నారు. ఖాతాదారులకు బ్యాంకు సేవలు ఎలా ఉంటాయన్న దానిపై అవగాహన కల్పిస్తున్నారు. ఇంటర్మీడియట్ విద్య అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించే కోర్సులపై విద్యార్థులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

ఆన్‌జాబ్ ట్రైనింగ్ పొందిన వారికి మార్కులు..

ఆన్ జాబ్ ట్రైనింగ్ పొందిన వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు మార్కులను కేటాయిస్తున్నారు. 100 మార్కుల శిక్షణలో విద్యార్థులు పాస్ కావడానికి 50 మార్కులు పొందాల్సి ఉంటుంది. శిక్షణ సమయంలో విద్యార్థుల హాజరు 90 శాతం వరకు ఉండాలి. విద్యార్థులకు ఉదయం సెషన్‌లో తరగతులు, మధ్యాహ్నం శిక్షణ ఉంటుంది. ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఆటో మొబైల్, ఈటీ, ఎంఈ కోర్సుల విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. సింగరేణి వర్క్‌షాపుల్లో మోటార్ వైండింగ్, సింగరేణి ఆస్పత్రుల్లో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల ఆన్ జాబ్ ట్రైనింగ్‌ను జిల్లా నోడల్ అధికారి పరిశీలించి అధ్యాపకులు, విద్యార్థులకు సూచనలు చేస్తున్నారు. ఒకేషనల్ కోర్సుల్లో బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులు ఇంటర్ తరువాతనే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినవారు అనేక మంది ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రెండు నెలల పాటు జరుగుతున్న ఆన్ జాబ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. ట్రైనింగ్‌కు క్రమం తప్పకుండా విద్యార్థులు హాజరు కావాలి. ఈ ట్రైనింగ్ భవిష్యత్‌లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ట్రైనింగ్‌లో విధులు నిర్వహించే అధ్యాపకులు సైతం గైర్హాజరు కాకుండా విద్యార్థులకు దిశానిర్దేశం చేయాలి.

– వెంకటేశ్వర్లు, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి

సమస్యల పరిష్కారానికి మార్క్సిజమే మార్గం

మాజీ ఎంపీ మిడియం బాబూరావు


మాట్లాడుతున్న మిడియం బాబూరావు, పక్కన నాయకులు

టేకులపల్లి: పేదలందరికీ భూమి దక్కాలంటే భూపోరాటాలను ఉధృతం చేయాలని, సకల సమస్యలకు పరిష్కారం మార్క్సిజం ఒక్కటే అని సీపీఎం నాయకుడు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. టేకులపల్లిలో ఆదివారం జరిగిన సీపీఎం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ శక్తులు ప్రభుత్వ రంగాలన్నింటిని నిర్వీర్యం చేస్తూ, ప్రజలను దోచుకుంటున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీకి అనుకూల విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. వీటిని గమనిస్తూ ప్రజలను చైతన్యం చేసేందుకు సీపీఎం కృషి చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తూ ప్రజలందరికీ ఆర్థిక సమస్యలను సృష్టిస్తున్న విధానాలపై ప్రజా పోరాటాలకు పదును పెట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, నిరుద్యోగ సమస్యలపై తాము చేస్తున్న పోరాటాలకు ప్రతి ఒక్కరూ కలిసిరావాలని కోరారు. మహాసభలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, భూక్యా రమేష్, నాయకులు ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, పూనెం స్వామి, పూనెం చంద్రశేఖర్, దొడ్డ సంపత్, పాయం వెంకన్న, జోగ రాంబాబు, పూనెం రాంబాబు, జోగ దశరథ్, దొడ్డ సావిత్రి, చుక్కమ్మ, కడుదుల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనసమారాధనలు

పెనుబల్లి: మండలంలో ఆదివారం కమ్మ, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్తీక వన సమారాధనలు నిర్వహించారు. నాయకులగూడెం మామిడితోటలో జరిగిన కమ్మ వన సమారాధనకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. కమ్మ కులస్తులంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆటపాటలు నిర్వహించారు. కార్యక్రమంలో కల్లూరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నీరజా ప్రభాకర్ చౌదరి, నున్నా రామకృష్ణ, చీకటి రామారావు, చింతనిప్పు సత్యనారాయణ, అనుమోలు సాంబశివరావు, రవి, మందడపు అశోక్‌కుమార్, మోరంపూడి బాబూరావు పాల్గొన్నారు.


మంత్రి తుమ్మలకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

మధిరలో మహిళా అఘోరి

మధిర : మధిర మండలంలోని దెందుకూరు రోడ్డులో ఆదివారం జరిగిన ఓ ప్రైవేటు ఆస్పత్రి ప్రారంభోత్సవానికి మహిళా అఘోరి హాజరయ్యారు. హైకేర్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఆస్పత్రి నిర్మించగా, డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైకేర్ ఆస్పత్రి యాజమాన్యం తక్కువ ఖర్చుతో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తోందని అన్నారు. డాక్టర్ నవీన్‌రెడ్డి దశాబ్ద కాలంగా ఉత్తమ సేవలు అందిస్తూ ఈ ప్రాంత ప్రజల మన్ననలు చూరగొన్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కాగా, కార్యక్రమానికి హాజరైన అఘోరి నందినిని ఆశీర్వదించారు. ఆస్పత్రి భవన సముదాయంలో జరిగిన మహా చండీయాగంలోనూ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో హై కేర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ జంగా నవీన్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ జంగా ప్రవీణ్ రెడ్డి, జంగా కోటిరెడ్డి, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, తూమాటి నవీన్ రెడ్డి, చెరుకూరి నాగార్జున్, యరమల శ్రీనివాసరెడ్డి, కోటేశ్వరరావు, నరేష్, సుధాకర్‌రెడ్డి, అఖిల్, బాజీ, తదితరులు పాల్గొన్నారు.


డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందినిని ఆశీర్వదిస్తున్న అఘోరి

రెచ్చిపోయిన ఇసుక మాఫియా

రెవెన్యూ అధికారులపై దాడికి యత్నం

బూర్గంపాడు: మండలంలో ఇసుక మాఫియా ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై, సిబ్బందిపై మాఫియా మనుషులు దాడికి యత్నించారు. సారపాక వద్ద గోదావరి తీరంలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. బూర్గంపాడు తహసీల్దార్ ముజాహిద్ కథనం ప్రకారం.. సారపాక బ్రిడ్జి కింద నుంచి గోదావరిలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. డిప్యూటీ తహసీల్దార్ రామ్‌నరేశ్, ఆర్‌ఐలు ముత్తయ్య, నర్సింహారావు, రెవెన్యూ సిబ్బందితో కలిసి శనివారం రాత్రి గోదావరి బ్రిడ్జి కిందకు వెళ్లారు. వీరి రాకను గమనించిన కొన్ని ట్రాక్టర్లు అక్కడి నుంచి వెళ్లాయి. ఒక ట్రాక్టర్‌లో ఇసుకను లోడింగ్ చేస్తుండగా రెవెన్యూ అధికారులు వెళ్లేసరికి వర్కర్లు, డ్రైవర్లు పరారయ్యారు. వారిని పట్టుకునేందుకు ముందుకు వెళ్తున్న క్రమంలో ఇద్దరు వ్యక్తులు ఆర్‌ఐ ముత్తయ్యపై భౌతికదాడికి యత్నించారు. ఓ వ్యక్తి ఆర్‌ఐ ముత్తయ్య కాలు పట్టుకుని కిందపడేశాడు. దీంతో అప్రమత్తమైన రెవెన్యూ సిబ్బంది అతడిని పట్టుకున్నారు. మిగతా వారంతా పరారయ్యారు. ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. డీటీ రామ్‌నరేశ్, ఆర్‌ఐ ముత్తయ్య తహసీల్దార్‌కు సమాచారమిచ్చారు. ఇసుక మాఫియా నుంచి రెవెన్యూ సిబ్బందికి ప్రాణహాని ఉందని, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలంటే తప్పకుండా పోలీస్‌శాఖ సహకారముండాలని తహసీల్దార్‌కు వివరించారు. ఘటనను కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిసింది.

ఆత్మహత్యాయత్నానికి స్థానికుల అడ్డుకట్ట

గోదావరి బ్రిడ్జి పైనుంచి దూకేందుకు యత్నించిన వ్యక్తిని రక్షించిన వైనం


బ్రిడ్జి పైనుంచి దూకేందుకు యత్నిస్తున్న ఆనంద్

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని గోదావరి బ్రిడ్జి పైనుంచి దూకేందుకు యత్నించిన ఓ వ్యక్తిని స్థానికులు రక్షించిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పట్టణంలోని ఏఎంసీ కాలనీకి చెందిన ఆనంద్ అలియాస్ హైజాక్ మద్యం మత్తులో భద్రాచలంలోని గోదావరి బ్రిడ్జి పైనుంచి దూకేందుకు గోడపై కూర్చున్నాడు. అటుగా వెళ్తున్న కొందరు వ్యక్తులు అతడిని గమనించి ఆత్మహత్య చేసుకోవద్దని సూచించారు. అయినప్పటికీ ససేమిరా అంటుండటంతో మరోవైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి దూరంగా ఆపి నెమ్మదిగా వచ్చి కిందకు లాగాడు. వెంటనే అక్కడికి వెళ్లిన స్థానికులు ఆనంద్‌ను భద్రాచలం పట్టణ పోలీసులకు అప్పగించారు. కాగా, ఆత్మహత్యకు యత్నించిన ఆనంద్‌కు కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన పోలీసులు తమకేమి పట్టనట్లు వ్యవహరించి ఆనంద్‌ను అతని స్నేహితులకు అప్పగించారు.

మహిళ ఆత్మహత్య

ములకలపల్లి: మద్యానికి బానిసైన మహిళను భర్త మందలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండంలోని పాతజిన్నెలగూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఈసం మంగమ్మ, నాగేశ్ దంపతులు కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగమ్మ (42) రెండేళ్లుగా మద్యానికి బానిసైంది. ఈ నెల 14వ తేదీన అతిగా మద్యం సేవించి కూలీ పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉండటంతో భర్త మందలించాడు. మనస్తాపానికి గురైన మంగమ్మ ఇంటి నుండి వెళ్లి సమీపంలోని పంటచేలో పురుగులమందు సేవించింది. కుటుంబీకులు గమనించి పాల్వంచ ఏరియా ఆసపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు ఈసం మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో వ్యాపారి...

ఏలూరుటౌన్: అప్పుల బాధలు తాళలేక ఆటోమొబైల్ షాప్ నిర్వాహకుడు రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏపీలోని ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామానికి చెందిన గొల్ల సద్గుణరావు (34) స్థానికంగా ఆటోమొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా దుకాణం నిర్వహణ సరిగా లేక అప్పులపాలయ్యాడు. దీంతో అక్కడి నుంచి ఆదివారం ఏలూరు వచ్చాడు. ఏలూరులోని నిమ్మకాయల యార్డు సమీపంలో గుర్తుతెలియని రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. రైల్వే ఎస్‌ఐ సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్య సమస్యలతో ఎస్‌ఎండీసీ సెక్యూరిటీ గార్డు...

పాల్వంచ: అనారోగ్య సమస్యల కారణంగా ఎస్‌ఎండీసీ సంస్థలో పనిచేసే సెక్యూరిటీ గార్డ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని శివనగర్‌కు చెందిన యడవల్లి విద్యాసాగర్(58) ఎస్‌ఎండీసీ సంస్థలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఫిట్స్, ఇతర సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. శనివారం రాత్రి సమయంలో ఇంట్లోని వరండాలో ఉరివేసుకున్నాడు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు గుర్తించారు. అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి కరాటే టోర్నీ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం


వాలీబాల్ విజేతలకు బహుమతి అందిస్తున్న డీవైఎస్‌ఓ తదితరులు

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా జూనియర్ కళాశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఆదివారం మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్–19 కరాటే పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఐఈఓ కె.రవిబాబు, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఆర్.ఐ ఎం.సురేశ్, జిల్లా క్రీడల కార్యదర్శి ఎండీ మూసాకలీం, జిల్లా కరాటే కోచ్ గోపతి సైదులు, పరిశీలకులు సత్యనారాయణ హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

బాలుర ఫలితాలు..

35 కేజీల కేటగిరిలో గణేశ్ (హైదరబాద్), లోకేశ్ (ఖమ్మం), 40 కేజీల్లో షణ్ముఖసాయి (ఖమ్మం), భూపేందర్ (సంగారెడ్డి), 45 కేజీల్లో తేజ్ (ఖమ్మం), విష్ణుమోహన్‌భరత్ (కరీంనగర్), నాగసాయి విఘ్నేశ్ (ఖమ్మం), ఖదీర్‌పాషా (ఖమ్మం), 82 కేజీల్లో గణేశ్ (ఖమ్మం) వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు.

బాలికల ఫలితాలు..

32 కేజీల కేటగిరిల్లో అక్స నార్యామ్, మనీషా (ఖమ్మం), మాధవి (సంగారెడ్డి), 44 కేజీల్లో జ్యోతిక (వరంగల్), కీర్తన (ఖమ్మం), భవ్యశ్రీ (సంగారెడ్డి), 48 కేజీల్లో రిజ్వానా(ఖమ్మం), స్నేహారెడ్డి (సంగారెడ్డి), ఆసియా (వరంగల్), 52 కేజీల్లో కావ్య (ఖమ్మం) వరుస స్థానాల్లో నిలిచారు.

విజేతలకు బహుమతులు

జిల్లాస్థాయి ఈశా గ్రామీణ క్రీడోత్సావాలు ఆదివారం ముగిశాయి. బహుమతి ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, వాలీబాల్ కోచ్ ఎండీ అక్బర్ అలీ, పీడీ రమణ, ఈశా బాధ్యులు ప్రియాంక, నవీన్ పాల్గొని వాలీబాల్, త్రోబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. పోటీల్లో అత్యధికంగా మహిళలు పాల్గొనడం విశేషమని నిర్వాహకులు తెలిపారు.

రాజ్యాధికారమే బీసీల అంతిమ లక్ష్యం

- అందుకోసం అవసరమైతే మిలిటెంట్ పోరాటం: ఆర్.కృష్ణయ్య



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, వి.హనుమంతరావు తదితరులు

కాచిగూడ: రాజ్యాధికార సాధనే బీసీల అంతిమ లక్ష్యమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆ లక్ష్య సాధన కోసం బీసీలంతా సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అవసరమైతే మిలిటెంట్ పోరాటాలకు కూడా సిద్ధంగా ఉండాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఆదివారం కాచిగూడ అభినంద్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ నెల 25వ తేదీన రవీంద్రభారతిలో నిర్వహించే 'బీసీల సమరభేరి'పోస్టర్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో పూర్తిస్థాయి వాటా దక్కలేదని ఆవేదన వ్యక్తంచేశారు. జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని, బీసీల జనాభాకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ సవరణ చేసి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల సమరభేరి కార్యక్రమానికి పార్టీలకతీతంగా బీసీలంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తంగెళ్లముడి నందగోపాల్, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, ఉదయ్ నేత, మట్టా జయంతి గౌడ్, సుధాకర్, ర్యాగ రమేష్, రఘుపతి, పరశురామ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం వరికి బోనస్: కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సన్న ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి చెప్పారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సన్నాలకు బోనస్ ఇవ్వడం గొప్ప నిర్ణయమన్నారు. రుణమాఫీ, బోనస్‌ల కింద ప్రభుత్వం ఇచ్చిన డబ్బులను రైతులు పెట్టుబడి కింద ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

మీ సేవ
సులభంగా, వేగంగా

దర్జాగా సర్టిఫికెట్ల దందా

రూ.45 సర్వీసు చార్జీకి రూ.500 నుంచి రూ.4,000 వరకు వసూళ్లు

- చాలాచోట్ల తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు కుమ్మక్కు
- జేఈఈ మెయిన్‌కు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం తల్లిదండ్రుల అగచాట్లు
- సర్టిఫికెట్‌కు ఇంత అని చెబుతూ వసూళ్లు చేస్తున్నట్టుగా ఆరోపణలు
- సాధారణ రోజుల్లోనూ ఇదే పరిస్థితి అనే ఫిర్యాదులు
- డబ్బులు ఇవ్వకుంటే రోజుల తరబడి పెండింగ్‌లో దరఖాస్తులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాజధాని హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా పలు మీ సేవ కేంద్రాల్లో సర్టిఫికెట్ల దందా కొనసాగుతోంది. సర్వీసు చార్జీల కింద రూ.45 తీసుకోవాల్సి ఉండగా సర్టిఫికెట్‌కు రూ.4,000 వరకు వసూలు చేస్తున్నారు. ఎన్ఐటీలు, ఐఐటీలు, జీఎఫ్‌టీఐలలో ప్రవేశాల కోసం ముందుగా నిర్వహించే జేఈఈ మెయిన్‌కు అవసరమైన సర్టిఫికెట్ల కోసం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివే పిల్లల తల్లిదండ్రులు మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని కేంద్రాల నిర్వాహకులు భారీ దందాకు తెరలేపారు. తల్లిదండ్రులకు అవసరం కాబట్టి ప్రాంతాన్ని బట్టి ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.500 నుంచి రూ.1,000 వరకు, కొన్నిచోట్ల రూ.4,000 వరకు కూడా వసూలు చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో కొంతమంది సిబ్బంది, అంటెండర్లతో కుమ్మక్కై ఈ దందా కొనసాగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జేఈఈ మెయిన్ అని కాకుండా సాధారణ రోజుల్లో సైతం తహశీల్దార్ కార్యాలయాల్లో డబ్బులు తీసుకుని కుల, ఆదాయ తదితర ధ్రువపత్రాలు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ముట్టకపోతే దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచేస్తున్నారని, కొంతకాలం తర్వాత ఏదో ఒక కారణంతో దరఖాస్తును తిరస్కరిస్తున్నారనే ఫిర్యాదులుండటం గమనార్హం.

పౌరసేవకు ఎగనామం

దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకే సర్టిఫికెట్ల జారీని ప్రభుత్వం పౌరసేవల పరిధిలోకి తెచ్చింది. నామమాత్రపు రుసుంతో సర్టిఫికెట్లు జారీ చేసే విధానం ప్రారంభించింది. అయితే దీనిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు తహసీల్ కార్యాలయాల సిబ్బంది, మీ సేవ నిర్వాహకులు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. రూ.45 సర్వీసు చార్జీ ఉండే ఓబీసీ సర్టిఫికెట్ కావాలంటే పట్టణ ప్రాంతాల్లోని పలుచోట్ల రూ.4,000 వరకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,000 వరకు చెల్లించాల్సిందేనని తెగేసి చెబుతున్నారు. తామే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, ఆ పత్రాలను తహసీల్దార్ కార్యాలయానికి పంపించి, ఆమోదించేలా చూస్తామని చెప్పి వసూళ్లు చేపడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

70 వేల మంది తల్లిదండ్రులపై ప్రభావం

అక్టోబర్ 28వ తేదీన జేఈఈ మెయిన్ నోటిఫికేషన్ జారీ అయింది. అదేరోజు నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నెల 22వ తేదీతో గడువు ముగియనుంది. కాగా ఏదైనా రిజర్వేషన్ వర్తించాలంటే సంబంధిత సర్టిఫికెట్లు కావాల్సిందే. ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 95 వేల మంది హాజరు కానుండగా, అందులో దాదాపు 70 వేలమందికి ఈ సర్టిఫికెట్లు అవసరమని అంచనా. దీనిని అసరాగా చేసుకొని మీసేవ కేంద్రాల నిర్వాహకులు, తహసీల్ కార్యాలయాల సిబ్బంది దందాకు తెరతీశారు.

సొమ్ము దండుకున్నా దబాయింపులే

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన శ్రీనివాస్‌కు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తన కుమారుడి కోసం (జేఈఈ మెయిన్‌కు దరఖాస్తు చేసేందుకు) ఓబీసీ సర్టిఫికెట్ అవసరమైంది. దరఖాస్తు చేద్దామని స్థానిక మీ సేవా కేంద్రానికి వెళ్లారు. అక్కడి నిర్వాహకుడు.. 'మేమే దరఖాస్తు చేస్తాం.. దరఖాస్తు ఫారాన్ని మేమే తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్చి ఆన్‌లైన్‌లో ఆమోదం పొందేలా చేస్తాం.. అందుకు రూ.1,000 ఖర్చు అవుతుంది'అని చెప్పాడు. రూ.45 దరఖాస్తుకు అంత చెల్లించాలా? అని శ్రీనివాస్.. బాలానగర్‌లోని మరో మీ సేవ కేంద్రానికి వెళ్లి అడగ్గా అక్కడా ఇదే సమాధానం ఎదురైంది. గత్యంతరం లేక రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేశాడు. 12 రోజులు గడిచినా దరఖాస్తును కార్యాలయ సిబ్బంది కనీసం ఓపెన్ కూడా చేయలేదు. మీ సేవ కేంద్రం నిర్వాహకుడిని అడిగితే 'అవుతుందిలే.. చేస్తాం.. తహసీల్దార్ కార్యాలయంలో చేయించే వ్యక్తి బిజీగా ఉన్నాడు..'అంటూ నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు. దీంతో శ్రీనివాస్ నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ కిషోర్ అనే వ్యక్తిని కలిశారు. అతను 'మీరు నేరుగా ఎలా వస్తారు..'అంటూ మండిపడ్డాడు. దీంతో శ్రీనివాస్ అక్కడ ఉన్న ఇతర సిబ్బందిని సంప్రదించారు. అంతా కుమ్మక్కే కావడంతో.. 'మీ దరఖాస్తు ఫారమే లేదు. మీరివ్వలేదు..'అంటూ వాళ్లు బుకాయించారు. రెండురోజులు తిరిగి విసిగిపోయిన శ్రీనివాస్ చివరకు తహసీల్దార్‌ను కలిసి పరిస్థితి వివరించాడు. ఆన్‌లైన్ ఫారం ప్రింట్ తీసి ఫైల్ సిద్ధం చేయాలని తహసీల్దార్ కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు. అయినా వారు పలు కొర్రీలు పెట్టారు. దీంతో శ్రీనివాస్ మళ్లీ తహసీల్దార్‌ను కలవడంతో ఎట్టకేలకు సర్టిఫికెట్ జారీ అయ్యింది.

అబద్ధాల పోటీ పెడితే.. మోదీదే మొదటి స్థానం

- మహారాష్ట్ర ఎన్నికల ప్రచార సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు
- కేంద్రం బీజేపీయేతర ప్రభుత్వాలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తోంది
- తెలంగాణలో రుణమాఫీ కింద రూ.18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహారాష్ట్రలోనూ రూ.3లక్షలు రుణమాఫీ చేస్తామని హామీ



ఆదివారం మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

నయాగామ్, భోకర్, సోలాపూర్: అబద్ధాల పోటీలు పెడితే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశంలోనే మొదటి స్థానంలో నిలుస్తారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఛత్రపతి శివాజీ, జ్యోతిబా పూలే, బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయులు, బాలాసాహెబ్ ఠాక్రే , శరద్ పవార్ వంటి యోధులు జన్మించిన మహారాష్ట్ర నేలలో ఇప్పుడు విద్రోహులు రాజ్యమేలుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నయాగామ్, భోకర్, నాందేడ్‌లలో జరిగిన ప్రచార సభల్లో ప్రసంగించారు. సోలాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. నయాగామ్‌లో మీనాల్ పాటిల్ ఖత్గావ్‌కర్.. భోకర్‌లో తిరుపతి కదమ్ కొండేకర్.. దక్షిణ సోలాపూర్‌లో చేతన్ నరొటే, నాందేడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో రవీంద్ర చౌహాన్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

వీరుల నేలలో విద్రోహులు

ఆటో డ్రైవర్‌గా ఉన్న ఏక్‌నాథ్ శిందేను బాలాసాహెబ్ కుటుంబం మంత్రిని చేసిందని.. శరద్‌పవార్ కూడా సొంత కుమార్తెను కాదని అజిత్ పవార్‌ను ఉప ముఖ్యమంత్రి చేశారని సీఎం రేవంత్ చెప్పారు. అశోక్ చవాన్, ఆయన తండ్రి శంకర్‌రావు చవాన్‌లను కాంగ్రెస్ పార్టీ సీఎంలను చేసిందని పేర్కొన్నారు. కానీ ఈ ముగ్గురు విద్రోహులుగా మారి వీరుల నేలను అవమానాల పాలు చేశారని విమర్శించారు.

తెలంగాణలో 'సంక్షేమం'పై వాస్తవాల పరిశీలనకు సిద్ధం

తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతు ఆత్మహత్యలు అధికంగా జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వాటికి అడ్డుకట్ట పడిందని రేవంత్ చెప్పారు. తమ ప్రభుత్వం 50రోజుల్లోనే రూ.18 వేల కోట్ల రుణమాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో వేసిందన్నారు. దేశంలోనే అత్యధికంగా రైతుల ఆత్మహత్యలు మహారాష్ట్రలో జరుగుతున్నాయని.. ఆ ఆత్మహత్యలను నిలువరించాలన్నా, రాష్ట్ర అభివృద్ధి జరగాలన్నా కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ)ల మహా వికాస్ అఘాడీ కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కూటమి అధికారంలోకి రాగానే రూ.3 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను ఆదుకుంటామన్నారు. తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో ఉద్యోగ నియామకాలు, రుణమాఫీ, ఇతర సంక్షేమ కార్యక్రమాలు వాస్తవమో, కాదో కేంద్ర మంత్రులనో, అధికారుల బృందాలనో పంపి తెల్చుకొమ్మని సవాల్ విసిరారు.



ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వినోద్‌కుమార్



తెలంగాణ సచివాలయం బాహుబలి మెయిన్ ఎంట్రెన్స్ గేట్లను తొలగించిన దృశ్యం

జిల్లా వార్తలు

నేడు ఉమ్మడి జిల్లాలో ఎంపీ రఘురాం రెడ్డి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని ఆరోగ్య ఆస్పత్రిలో ఆర్థో యాక్సిడెంట్ కేర్ యూనిట్ ప్రారంభిస్తారు. ఆ తర్వాత 11:30 గంటలకు భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డిపల్లికి చేరుకుని జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ ప్రారంభిస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు పెనుబల్లి మండలం టేకులపల్లిలో ఓ శుభకార్యానికి హాజరవుతారు. 2:30 గంటలకు తల్లాడ మండలం మిట్టపల్లి, మధ్యాహ్నం 3 గంటలకు నూతనకల్ గ్రామాల్లో మృతుల కుటుంబాలను పరామర్శిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఖమ్మం గట్టయ్య సెంటర్‌లోని క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల బాధ్యులు, కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని ఎంపీ క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ కోరారు.

రామయ్యకు బంగారుహారం బహూకరణ



హారం అందజేస్తున్న దాతలు

భద్రాచలంటౌన్: భద్రాలచం శ్రీసీతారామచంద్రస్వామి వారికి పట్టణానికి చెందిన కొంజర్ల సుబ్రహ్మణ్యం–కృష్ణకుమారి దంపతులు 63 గ్రాముల బంగారు హారాన్ని ఆదివారం బహూకరించారు. హారం విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా దాతలు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు దాతలకు స్వామివారి జ్ఞాపికతో పాటు ప్రసాదం అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా తణుకు మండలం మండపాక గ్రామానికి చెందిన నిమ్మగడ్డ కిషోర్–క్రాంతి దంపతులు ఆదివారం రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన పొన్నూరి ఉమా సుకన్య రూ.72 వేల విలువైన రెండు హారాలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకోగా, ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు.

ఎట్టకేలకు విడుదల !



భద్రాచలం ఆలయం వ్యూ

- ఆలయాలకు కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు
- ఉమ్మడి జిల్లాలో 76 ఆలయాలకు అవకాశం
- ఏడాది కాల పరిమితితో కొత్త కమిటీలకు కసరత్తు
- ఇప్పటికే 16 ఆలయాలకు నోటిఫికేషన్

ఖమ్మంగాంధీచౌక్: ఆలయాలకు కమిటీల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. నామినేటెడ్ విధానంలో పాలక వర్గ కమిటీల నియామకానికి కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతుండడంతో నామినేటెడ్ పదవుల కోసం ఒత్తిడి వస్తోంది. మరోపక్క ఆలయాలకు కమిటీల లేక నిర్వహణ ఇబ్బందిగా మారుతోంది. ఈ నేపథ్యాన ఆలయ కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పరిధిలో 76 ఆలయ కమిటీల ఏర్పాటుకు అవకాశం ఉంది. గత నిబంధనల్లో మార్పులు లేకుండానే ఏడాది కాల పరిమితితో పాలక వర్గాలను నామినేట్ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

ఖమ్మంలో 54.. భద్రాద్రి జిల్లాలో 22

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 76 ఆలయాల నూతన పాలక వర్గాల ఏర్పాటుకు అవకాశముంది. ఇందులో ఖమ్మం జిల్లాలో 54, భద్రాద్రి జిల్లాలో 22 దేవాలయాలు ఉన్నాయి. వీటిలో పాలక వర్గాల ఏర్పాటుకు ప్రభుత్వం దఫాల వారీగా నోటిఫికేషన్ జారీ చేయనుంది. అందులోని వివరాల ఆధారంగా అర్హులైన వారు పాలక వర్గ పదవులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

నాలుగు యాజమాన్యాల పరిధిలో..

ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు నాలుగు యాజమాన్యాల పరిధిలో కొనసాగుతున్నాయి. భద్రాద్రి జిల్లాలోని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి, పాల్వంచలోని పెద్దమ్మ గుడి(శ్రీ కనకదుర్గ), ఖమ్మం జిల్లాలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వర్వ స్వామి ఆలయాలు ప్రభుత్వ పరిధిలో నిర్వహించబడుతున్నాయి. ఈ ఆలయాలకు 14 మంది చొప్పున పాలక వర్గ సభ్యులను నియమించాల్సి ఉంటుంది. ఈ మూడు ప్రధాన ఆలయాలు కమిటీ కావడంతో చైర్మన్ లేదంటే కనీసం డైరెక్టర్‌గా అయినా స్థానం దక్కించుకునేందుకు ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఇక దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ పరిధిలో ఖమ్మం జిల్లాలో 36, భద్రాద్రి జిల్లాలో 15 దేవాలయాలు కొనసాగుతున్నాయి. ఈ 51 ఆలయాల పాలకవర్గ పదవులు ఖాళీగా ఉన్నాయి. అలాగే, ధార్మిక పరిషత్ పరిధిలో ఖమ్మం జిల్లాలో 12 ఆలయాలు, భద్రాద్రి జిల్లాలో మూడు ఆలయాల నిర్వహణ కొనసాగుతోంది. ఇక వరంగల్ దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పరిధిలో ఖమ్మం జిల్లాలో ఐదు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు దేవాలయాల నిర్వహణ జరుగుతోంది.

మొదటి దఫాలో 16...

ఉమ్మడి జిల్లాలోని అన్ని దేవాలయాల పాలక వర్గాలకు నూతన కమిటీల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. అయితే, తొలిదశలో భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, పాల్వంచ మండలంలోని పెద్దమ్మ తల్లి ఆలయంతో పాటు ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పాలక మండలి నియామకానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలోని మరో 13 ఆలయాలకు సంబంధించి సైతం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ జాబితాలో భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయం, కొత్తగూడెంలోని శ్రీవిజయ విఘ్నేశ్వర స్వామి ఆలయం ఉన్నాయి. అలాగే, ఖమ్మంలోని శ్రీ వెంకటేశ్వర సామి ఆలయం(కమాన్ బజార్), శ్రీ మారెమ్మ అమ్మవారి ఆలయం(రెడ్డిపల్లి, ఖమ్మం రూరల్ మండలం), శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి ఆలయం(కాల్వొడ్డు, ఖమ్మం), శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం(గుట్ట, ఖమ్మం), శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం(కందుకూరు, వేంసూరు మండలం), శ్రీ నీలాద్రీశ్వర స్వామి ఆలయం(నీలాద్రి, పెనుబల్లి మండలం), శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయం(మధిర), శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయం(తీర్థాల, ఖమ్మం రూరల్ మండలం), శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం (గార్లొడ్డు, ఏన్కూరు మండలం), శ్రీ కోట మైసమ్మ అమ్మవారి ఆలయం (ఊసిరికాయలపల్లి, సింగరేణి మండలం), శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం (పర్ణశాల, ఇందిరానగర్, ఖమ్మం) ఉన్నాయి.

నిర్దేశిత నమూనాలో దరఖాస్తులు

పాలక మండళ్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైన ఆలయాల్లో ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు అందజేయొచ్చు. నిర్దేశిత ఫామ్ ద్వారా ఆలయంలో లేదా ఖమ్మంలోని ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలోనైనా దరఖాస్తులు ఇవ్వొచ్చు.

– ఎం.వీరస్వామి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

భద్రగిరికి పోటెత్తిన భక్తులు

కార్తీక మాసంలో పెరిగిన రద్దీ

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానానికి కార్తీక మాసం, ఆదివారం కావడంతో రద్దీ పెరిగింది. కార్తీక మాసం ప్రారంభం నుంచీ రామయ్య దర్శనానికి భారీగా భక్తులు తరలి వస్తుండడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడుతోంది. వారంతా పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తుండడంతో గోదారి తీరంలో కూడా సందడి వాతావరణం నెలకొంటోంది. ముఖ్యంగా శని, ఆది, సోమ వారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటోంది. ఆలయంలో స్వామివారి నిత్య కల్యాణం, చిత్రకూట మండలంలో జరిగే శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాల్లోనూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు.



ఆలయం లోపల కిటకిటలాడుతున్న భక్తులు

ఒక్క నిర్ణయం.. 500 ఉద్యోగాలు



గనుల్లో పనిచేస్తున్న కార్మికులు

- సింగరేణిలో ఏళ్లుగా పరిష్కారం కాని 'అలియాస్' సమస్య
- ఫలితంగా ఉద్యోగ వారసుల ఎదురుచూపులు
- విజిలెన్స్ విచారణ జరిపినా ముందుకుపడని అడుగులు
- ఈ ప్రభుత్వమైనా స్పందించాలని వారసుల వేడుకోలు

సింగరేణి(కొత్తగూడెం): ఒకటి కాదు రెండు ఏకంగా 500 కుటుంబాలు.. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నాయి. వీరేమీ అక్రమ విధానాల్లో ఉద్యోగాలు ఇప్పించాలని కోరడం లేదు. వారసత్వంగా రావాల్సిన ఉద్యోగాలు కేటాయించాలని కోరుతున్నా సింగరేణి యాజమాన్యం మనస్సు కరగడం లేదు. పాలకులు మారుతున్నా ఇచ్చిన హామీని నెరవేర్చాలన్న ఆలోచన రాకపోవడంతో వందలాది కుటుంబాలు ఆవేదనలో మగ్గుతున్నాయి.

వేర్వేరు పేర్లతో ఇక్కట్లు

గ్రామీణ ప్రాంతాల్లో రికార్డుల్లో ఒకటి.. వ్యవహారికంగా మరో పేరు ఉండడం సహజం. దీంతో ఏళ్ల క్రితం సింగరేణి గనుల్లో పనులకు ఎవరూ రాకపోవడంతో అర్హతలు ఉన్నా, లేకపోయినా పలువురిని చేర్చుకున్నారు. అయితే, వారి ఇళ్ల వద్ద పిలిచే పేరు ఒకటి ఉండగా.. రికార్డుల్లో మరొకటి నమోదైంది. ఇది ఇన్నాళ్లూ బాగానే ఉన్నా ఇప్పుడు మెడికల్ ఇన్ వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు శాపంగా మారింది.

తీవ్రజాప్యం

చాలా మంది సుమారు 40 ఏళ్ల పాటు సింగరేణి సంస్థ అభివృద్ధికి పాటుపడగా రకారకాల అనారోగ్య కారణాలతో మెడికల్ ఇన్ వాలిడేషన్ అయ్యారు. అయితే, ఇందులో పలువురికి రెండేసి పేర్లు ఉండడంతో ఇన్నాళ్లు రాని సమస్య ఇప్పుడు ఎదురవుతోంది. మెడికల్ ఇన్‌వాలిడ్ అయి ఏళ్లు గడుస్తున్నా వారసులకు ఉద్యోగాలు ఇచ్చే సమయంలో కొర్రీలు పెట్టటం సరికాదని కార్మికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

చిన్నచిన్న కారణాలతో..

అలియాస్ పేర్ల కారణంగా ఉద్యోగాలకు నోచుకుని వారు సింగరేణి వ్యాప్తంగా 500 మంది వరకు ఉంటారు. అయితే, చిన్నచిన్న కారణాలతో వీరి నియామకాలకు నివేదిక ఇవ్వడంలో విజిలెన్స్ విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఆశించిన తల్లిదండ్రులకు నిరాశే ఎదురవుతుండగా.. ఈ జాప్యంతో కొందరు పిల్లలకు కుదిరిన పెళ్లిళ్ల సైతం నిలిచిపోయే పరిస్థితి నెలకొందని తెలుస్తోంది.

ప్రభుత్వం మారినా...

సింగరేణి సంస్థలో పనిచేసే కార్మికులకు అలియాస్ పేరు మార్పిడి విషయమై న్యాయం చేస్తామని 2017లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తింపు సంఘం ఎన్నికల వేళ హామీ ఇచ్చింది. అయితే, అటు ప్రభుత్వం, ఇటు యూనియన్ పదవీకాలం ముగిసినా హామీ మాత్రమే నెరవేరలేదు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇదే హామీ ఇచ్చినా.. ఏడాది కావస్తున్నప్పటికీ హామీని నెరవేర్చకపోవడంతో సుమారు 500 కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి.

ఒకసారి సెటిల్‌మెంట్ చేస్తే..

ఏళ్ల క్రితమే మెడికల్ ఇన్ వాలిడేషన్ పూర్తయిన పలువురు ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోగా రెండేసి పేర్లు ఉన్న విషయాన్ని గుర్తించారు. దీంతో విజిలెన్స్ విభాగానికి నివేదించారు. ఈ మేరకు దరఖాస్తుల ఆధారంగా కార్మికుల ఇళ్లకు వెళ్లి సమీపంలోని వారిని రకరకాల ప్రశ్నలు వేసి విచారణ చేపట్టారు. సంస్థ అభివృద్ధికి ఏళ్ల పాటు పనిచేసిన తమ విషయంలో కనీస మర్యాద లేకపోయినా, విచారణను ఓపికగా భరించినప్పటికీ వారసులకు ఉద్యోగాలు రాకపోవడంతో కార్మికుల వేదన అంతా ఇంతా కాదు. ఈ మేరకు ఇలాంటి దరఖాస్తులన్నింటినీ వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద పరిష్కరిస్తే 500 కుటుంబాల్లో వెలుగు నిండుతాయనే విషయాన్ని యజమాన్యం గుర్తించాలని పలువురు కోరుతున్నారు.

అప్పటి నుంచి సగం జీతం ఇవ్వాలి..



సింగరేణి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే ఐఆర్‌పీఎం, వెల్ఫేర్ వింగ్‌లతో సమీక్షిస్తే ఇలాంటి కార్మికుల సమస్య పరిష్కరించొచ్చు. అయినా విచారణను విజిలెన్స్‌కు ఇవ్వడం సరికాదు. మెడికల్ అన్‌ఫిట్ అయిన నాటి నుంచి కార్మికుడికి సగం జీతం ఇవ్వాలని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అలియాస్ అంశాన్ని త్వరగా పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తాం.

–రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ జనరల్ సెక్రటరీ